

# విరామం

## - అంగర వేంకట కృష్ణారావు



*1939 నుంచి 45 వరకూ జరిగిన రెండో ప్రపంచ మహాయుద్ధం మానవ జాతి మనుగడలో ఒక బృహత్తర ఘట్టం. ఈ సమరంలో రాజ్యాలు చూస్తూండగా పేక మేడల్లా కూలిపోయేయి. మహానగరాలు తిరగట్లో పప్పులా పిండైపోయేయి. మనుషులు కుంపట్లో పడ్డ చీమల్లా మాడిపోయేరు. ఆ విధ్వంసకాండ అభూతం! వర్ణనాతీతం.*

*పోతే, యిక మరి యుద్ధం వద్దనిపించిందా? మరి హింస వద్దు అనిపించిందా? ఉహుఁ యుద్ధమన్నా, హింసన్నా, జంకుపోయిందేమో...యుద్ధమే యెల్లప్పుడూ సాగేది. శాంతి ఒక "విరామం" లాంటిది.*

*ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రికలో ధారావాహికంగా వెలువడ్డ ఈ నవల్లో అడుగడుగునా "నేను" వున్నా ఇది కేవలం నా వూహ కాదు. ఈ ప్రదేశాలు నా కళ్ళతో చూసినవి. అయితే, రచనకి కల్పన అవసరం. ఇందులో కల్పన 'అంత మాత్రమే' వుంది.*

అంగర వెంకట కృష్ణారావు

*ఒక చిన్న మాట!*

*ఇటీవల తెలుగులో వస్తున్న నవలలన్నీ అపౌరుషేయాలు. భబానీ భట్టాచార్య బెంగాల్ క్షామం గురించి వ్రాసిన 'సోమెనీ హంగర్స్' తో తులతూగ గల మొట్టమొదటియుద్ధ దుష్ఫలితాల నభివ్యక్తం చేసే నవల తెలుగులో 'విరామం' అంటే ఎవరూ ఆశ్చర్యపోనక్కరలేదు. సాంస్కృతిక జీవనం పూర్తిగా స్తంభించిపోయి, అన్ని కళలూ, శాస్త్రాలూ, సర్వమూ సినిమాకు, రాజకీయాలకూ దాస్యం చేస్తున్న ఈ రోజులలో, శక్తిమంతమైన రచనలు రావటానికి ఉన్న అవకాశాలు దాదాపు మృగ్యం. సాహిత్యంలో వచ్చే కొత్త పోకడలను పసికట్టి, ఆదరించి ప్రోత్సహించే స్థితిలో పత్రికలు, ప్రచురణకర్తలు లేకపోయినట్లయితే, ఇక ఆ దేశపు దౌర్భాగ్యం గురించి చెప్పనవసరం లేదు. మనుష్యులలో ఏ ఒక జాతిపట్లనైనా ద్వేషం ప్రకటించడం యావత్తు మానవజాతినీ ద్వేషించడం కాగలదనే జ్ఞానం కూడా లేని రచయితలున్న మన దేశంలో, సాహిత్యం కాలక్షేపానికి తప్ప మరెందుకూ పనికి రాదేమో...ఈ పై సందేహాలన్నిటికీ నివృత్తి 'విరామం' నవల. అందుచేత తెలుగు నవలా సాహిత్యంలో శ్రీ అంగర వెంకట కృష్ణారావుగారి 'విరామం' ఒక కొత్త మలుపు. బెంగాలీలో భబానీ భట్టాచార్య, బిభూతి భూషణ బందోపాధ్యాయ, మానిక్ బందోపాధ్యాయ, మలయాళంలో తక్కాళి శివశంకర పిళ్లై, తమిళంలో ఆర్.కె.నారాయణ్, కానా శివసుబ్రహ్మణ్యం వంటి రచయితల కోవలోకి చేరుతారుతెలుగులో చాసో, కె.కె., రా.వి. శాస్త్రి, అంగర వెంకట కృష్ణారావు, కాళీపట్నం రామారావులు.ఇతివృత్తం, భాష, శైలి శిల్పం, పాత్ర పోషణతో సహా అన్నింట్లోనూ 'విరామం' భారతీయ భాషలలో వచ్చే ఏ ఉత్తమ నవలకు తీసిపోదని నవినయంగా మనవి చేసుకుంటున్నాను.*

పురాణం సుబ్రహ్మణ్యశర్మ

*విజయవాడ, 24-1-1970*

*(గత సంచిక తరువాయి)*

2

సుమారైదు గంటలకి రైలు అఖౌరా స్టేషను చేరింది. స్టేషనుకి రెండు వైపులా ప్లాట్ ఫారాలున్నాయి. స్టేషను నిర్మానుష్యంగా వుంది. వాన జోరుగా పడుతూంది.

అఖౌరా చిన్న స్టేషను. చుట్టు ప్రక్కల ఎటు చూసినా యిళ్ళు కనిపించలేదు. ఎటు చూసినా వాన మాత్రం కనిపిస్తుంది. గోతులు, బురద, నీరు కనిపిస్తున్నాయి. సామాన్లతో స్టేషను ఆవరణలోకి చేరా. స్టేషను మాష్టరు గది తలుపు మూసివుంది. తలుపు తట్టా, బాదగా బాదగా స్టేషను మాస్టరు తలుపు ఓరవాకిలిగా తెరచి, నన్నెగాదిగా చూసి "పక్కని ఆర్.టి.ఓ. ఆఫీసుంది" అని తల అడ్డంగా తిప్పి మళ్ళీ తలుపేసుకున్నాడు.

నేను వానకోటు తొడుక్కున్నా కనక బాధలేదు. కొంచెం నాలుగు మూలలా వెతికితే ఆర్.టి.ఓ. ఆఫీసు కనిపించింది. కాని ఆ గదిబైట తాళం వేసుంది. స్టేషనులోకి తిరిగి వచ్చా. అక్కడ నాలాగే నలుగురైదుగురు తెల్లవాళ్ళు చేరారు. అంతా వానకోట్లేసుకున్నారు. ఒకడు నా వేపు, నా సామాన్ల వేపు చూసి నవ్వుతూ ఎక్కడికెళుతున్నావని ప్రశ్నించేడు.

నేను "సిక్స్ ఇండియన్ హెవీ యాకాక్ వర్క్ షాపు" కి వెళ్ళాలన్నా. అతను తన పక్కనున్న మరో తెల్లవాడివేపు చూసేడు. రెండోవాడు మొదటివాడి వేపు చూసి, మొహం అదోలా పెట్టి పెదిమలు విరుస్తూ భుజాలు కుదిపేడు. మొదటి వాడు నా వేపు చూసి, తిరిగి అదే పని చేసేడు. "వెల్" అంటే "వెల్" అని వాళ్ళు వెళ్లిపోయేరు. తరవాత అంతా అక్కణ్ణించి వెళ్ళిపోయేరు. నేను మిగిలేను, ఒకటే శబ్దం మిగిలింది. అది నగారా మోతలాంటి వానశబ్దం.

స్టేషనులో దీపాల్లేవు. చిమ్మచీకటి. క్షణమైనా విరామం లేకుండా ఉరుములు ఉరుముతున్నాయి.

భోజనం ప్రసక్తే లేదు. కనీసం టీ అయినా దొరికే సూచనల్లేవు. అక్కడ మనుషులే లేరు. మళ్ళీ స్టేషను మాస్టరు గది తలుపు తట్టా. అతను తలుపు తెరిచి హరికేన్ లాంతరు నా మొహంమీద పెట్టి ఏం కావాలన్నట్టు చూసేడు.

"క్షమించండి, ఆర్.టి.ఓ. ఆఫీసు మూసివుంది..." అన్నాను.

"ఔను. ఇప్పుడు తెరిచివున్నది వానొక్కటే, ఇక్కడికి రాత్రి రైళ్ళు రావూ పోవూ."

"ఇక్కడ వెయిటింగ్ రూముందా?"

"వెయిటింగే వుండదు. రూమెందుకూ?"

"నేనీరాత్రి ఎక్కడుండాలి?"

"నేనెలా చెప్తా?"

"క్షమించండి నేనేం చెయ్యను. చూడండి స్టేషన్ లోకి పిక్కలు మునిగిన నీరొచ్చింది."

"నాకు తెలుసు. అందుకే నా గది తలుపు మూసేశా. మీరు తలుపు తట్టితే విధిలేక తెరిచా. ఇక శలవైతే యిదిగో తిరిగి మూసేస్తున్నా." సగం తీవ్రంగా, సగం వెకాస్యంగా అన్నాడు.

"మొదట నన్ను లోపలికి రానివ్వండి. తరువాత ముయ్యొచ్చు..." నేనూ ఆ ఫక్కీలోనే అన్నా.

అతనొక్క క్షణం ఆలోచించి "రండి" అన్నాడు. నేను సామాన్లు తెచ్చుకుని స్టేషను మాస్టరు గదిలో దూరా.

తరవాత స్టేషను మాస్టరు కొన్ని వివరాలు చెప్పేడు. ఆ చుట్టు పక్కలంతా చాలా భాగం అడివి ప్రదేశం. అన్నీ కచ్చా రోడ్లు. అప్పటికి నాలుగైదు రోజుల్నుండి వాన తెరిపి లేకుండా కురుస్తూంది, ఆ ప్రదేశంలో అంతా జలమయమైంది. టెలిగ్రాఫ్, టెలిఫోను స్తంభాలు కూలిపోయేయి. రోడ్లు, చెరువులు, బురద గుంటలు కూలిన చెట్లు, అన్నీ ఏకమైపోయేయి. తంతితపాల, టెలిఫోన్లు పడుకున్నాయి. సాహసించి బైటకొచ్చిన ట్రక్కులు, లారీలు రొంపిలో దిగబడుతున్నాయి.

తిండిలేదు. టీ అయినా లేదు. అదృష్టవశాత్తు సిగరెట్లున్నాయి. అవీ లేకపోతే పిచ్చెత్తి పోదును. నేను, స్టేషను మాస్టరు సిగరెట్లు కాలుస్తూ కొంత సేపు కబుర్లు చెప్పుకున్నాం. తరువాత పడుకున్నాం.

స్టేషను మాస్టరు తెల్లవారకముందే ఎప్పుడో లేచి తన పని చూసుకుంటున్నాడు. నాకు తెలివొచ్చే సరికి ఆరున్నర దాటింది. వాన మధ్య చినుకులు కత్తెర వాటుగా పడుతున్నాయి. వాన చప్పుడు లేకపోయినా ఆకాశం అనుమానం కొద్దీ మొగుడి మీద అలిగిన పెళ్ళాం మొహంలా వుంది, ట్రక్కులూ, లారీలూ బురదలోంచి వర్షాకాలపు పురుగుల్లా వస్తూ పోతూ ఉన్నాయి. బురదలో దిగబడినప్పుడు బైటికి రాలేక, నరాలు బిగించి మొర్రో అంటున్నాయి.

ఉదయం కూడా టీ లేదు. ఒక బెంచీ మీద కూచున్నా. ఏ మిలిట్రీ లారీవాళ్ళనడిగినా "సిక్స్త్ ఇండియన్" అనగానే తెల్లమొహాలు వేస్తున్నారు. పోస్టుకోసం అన్ని యూనిట్ల ట్రక్కులూ యిక్కడికే వస్తాయి. ఇవాళ వాన కాస్త తెరిపిగా వుంది. కనక మీ యూనిట్ ట్రక్కు కూడా రావచ్చు. అని సముదాయించి వెళ్ళిపోతున్నారు. నేనలాగే కూచున్నా.

ఇంతలో ఒక సివిలియనొచ్చి నా ప్రక్కన కూచున్నాడు. ఇక్కడి వానల్ని గురించి నేనతన్ని హిందీలో భోగట్టా చేశా..

"ఇక్కడ వానలు విపరీతంగా కురుస్తాయి." ఇలా కురుస్తూంటే బళ్ళ రాకపోక లుండవు. ఎండ బాగా వచ్చి, కాస్త నేల గట్టిపడే వరకూ లారీలు నడవ్వు.

"వాన యెన్నాళ్ళు పడుతుంది."

"ఒక్కొక్కపుడు పది పదిహేను రోజులు ఆగకుండా పడుతుంది."

నా గుండె గుభేలు మంది.

"ఐతే నే నగర్తలా యెలా వెళ్ళడం?"

"అగర్తలా? అగర్తలాకి బస్సుంది. ఇక్కడికి ఇరవై నిమిషాలే ప్రయాణం. బస్సు తిన్నగా రాజాగారి భవనం వరకూ వెళ్ళి వెంటనే తిరిగొచ్చేస్తుంది. కాని అక్కడ మిలిటీ యూనిట్లేవీ లేవు. మీరు వెళ్ళవలసింది కనీసం పదిహేను మైళ్ళు చిట్టడివి."

"హుం. ఇక్కడ చుట్టుపట్ల టీ దొరుకుతుందా?"

"ఇక్కడేం దొరుకుతుంది! నాతో వస్తే యిప్పిస్తా."

"సరే..."

బైల్దేరాం. అతను గొడుగు విప్పేడు. అతను సన్నంగా పొడుగ్గా వున్నాడు. చిన్న వుంగరాల జుత్తు, బుగ్గ యెమికలు యెత్తుగా వున్నాయి, పెద్ద కళ్ళు, పంచా చొక్కా. ముప్పై ఐదేళ్ళుంటాయి.

"మీదే ప్రాంతం?" అతను అడిగాడు.

"మద్రాసు..."

"తమిళా?"

"కాదు, తెలుగు..."

"ఏవూరు?"అని తెలుగులో ప్రశ్నించేడు.

నేను ఆశ్చర్యపోయేను. యాసగా ఉన్నా అది తెలుగే. ఎక్కడ తెలుగు దేశం! ఎక్కడ అగర్తలా! ఇక్కడ వొక వ్యక్తి, ఈ విపరీత పరిస్థితుల్లో నాతో తెలుగులో మాట్లాడుతున్నాడు.

"మాది విజయనగరం. మీకు తెలుగెలా వచ్చు?"

"నాను బొరంపురం కొటేక్ లో సాపుల వర్తకం చేస్తా"

"ఓహో! బరంపురం పొత్తి పంచల చాపుల వర్తకమా..."

"ఉహూం కాదు. సాపులు సిల్క సరస్సులో వుండే సాపులు..."

"సరే సరే... చేపలు మచ్చి"

"ఆ.... అదే..."

"మరి ఇక్కడికెందు కొచ్చేరు?"

"బిజినెస్...."

"బిజినెస్...." నాలో నేను గొణుక్కున్నా.

అతని పేరు "దాస్." బెంగాలీ దాసుకి కాలి జోళ్ళు లేవు. బురద అతని వేళ్ళ సందుల్లోంచి పైకి చిమ్ముకొస్తూంది. పంచె యెగకట్టేడు, గబ గబ నడుస్తున్నాడు. నాకే కాస్త యిబ్బందిగా వుంది, బురదలో దిగబడుతోన్న "ఎమ్యూనిషన్ బూట్లు" బరువెక్కి పోయాయి.

అలా బురదా, నీళ్లూ దాటుతూ మూడు ఫర్లాంగులు నడిచేం. అక్కడ చిన్న మట్టి కొంపలు నాలుగైదున్నాయి. పైన టిన్ రేకులు.

దాసు ఒక తలుపుతట్టి "గొంతీ! ఓ గొంతీ!" అని పిలిచేడు. ఇరవై ఏళ్ళ స్త్రీ తలుపు తీసింది, నల్లగావుంది. జుత్తు నడినెత్తిమీద ముడేసింది. పెద్ద కళ్ళు, కాని తిండిలేక యెండినట్టుంది. దాసు నన్ను లోపలికి రమ్మన్నాడు. గొంతి వొక చింకి చాప పరిచింది.

ఆ కొంప మొత్తం ఆ గదిమాత్రమే. మధ్యగా వొక చింకి తడక అడ్డుగోడలా వుంది. తడక కవతల వున్న నులక మంచం నీడవుపిస్తూంది. వేళ్ళాడుతున్న కుళ్ళు దుప్పటీ కొసకూడా అవుపిస్తూంది. పొయ్యి కూడా అటువేపే వుంది.

గొంతి అవతల భాగంలో వుండగా దాసు యేదో అన్నాడు. గొంతి కూడా యేదో అంది, నాకర్థం కాలేదు. పక్క కొంపల్లోంచి మాటలు వినిపిస్తున్నాయి.

దాసు, అక్కడి పరిస్థితులేవీ బాగులేవని, బీదవాళ్ళకి బతకటం కష్టంగా వుందని – కబుర్లు చెపుతున్నాడు. పది నిమిషాల్లో గొంతి టీ, బన్నులు తెచ్చి మా ముందు పెట్టి నించుంది. నేనామెని కూచోమన్నా. కాని తడకవతలికి వెళ్ళిపోయింది.

టీ చేపల కంపు కొడుతూంది. బన్ను ముక్కిపోయింది. కాని తొలినాడు చాంద్ పూర్ మిలిట్రీ క్యాంపు వాళ్ళిచ్చిన చపాతీ, టీ తీసుకున్న తరువాత పచ్చి మంచినీళ్ళు తాగలేదు. ఆకలి మండిపోతూంది. ఎలాగో బన్ను కొరికి టీ గొంతులో పోసుకున్నా. కడుపులో తిప్పినట్లైంది. గొంతి గ్లాసులు తీసింది. దాసు ఆమెని కూచోమన్నాడు. ఆమె ముడుచుక్కూచుని మోకాళ్ళమీంచి రెప్పలార్పకుండా చూస్తుంది.

"ఇక్కడ కూర్చుంటారా?" దాసు నన్నడిగేడు.

"కూర్చునే వున్నానుగా..."

దాసు నవ్వేడు. గొంతి మాత్రం, నవ్వలేదు. నావేపు ఆతృతగా చూస్తుంది. నాకర్థమైంది ఆ "కూర్చోడం" ఏమిటో.

నేను లేచి దాసుని లెమ్మన్నా. దాసు లేచేడు. గొంతి కూడా చివాల్న లేచింది. నేను ఐదు రూపాయల నోటు చేతిలో పెట్టి దాసుతో పద అన్నా. ఆమె నోటు వూపుతూ గబగబ ఏదో అంది. దాసు మాటలు నవిలినట్టు ఏదో అని వెకిలిగా నవ్వేడు. భోజనమైనా చెయ్యకుండా, విశ్రాంతి తీసుకోకుండా ఆ డబ్బివ్వడం దేనికందిట.

నేను వాన కోటు తొడుక్కున్నా. ఇద్దరం తిరిగి అఖౌరా స్టేషను చేరేం. అక్కడ దాసు మళ్ళీ అన్నాడు. “నేను సాయంత్రం వస్తా. అప్పటి వరకూ మీరిక్కడేవుంటే రాత్రి గొంతియింట్లో పడుకోండి” నేను జవాబు చెప్పలేదు. దాసు గొడుగు విప్పి వెళ్ళిపోయేడు.

సన్నని కత్తెర వానలో ఆకాశం అద్దంలా మెరుస్తుంది. నా మనసులో పద్మ, దాసు, గొంతి మెరుస్తున్నారు. ఇది రెండో ప్రపంచ మహాయుద్ధం. ఇది యుద్ధ కలాపాలకీ, కరుదు కాటకాలకీ రంగస్థలమైన తూర్పు బెంగాలు. భవిష్యత్కాలం యిక్కడ యింకే వింతలు చూపిస్తుందో నాకు!

3

ఆవాళ మధ్యాహ్నం మూడు గంటలకి వాన పూర్తిగా వెలిసింది. కొంచెం సూర్యదర్శనం అయింది. ఆర్.టి.ఓ. ఆఫీసు తెరిచేరు. ఆర్.టి.ఓ. నా ఉదంతం అంతా విని చాలా విచారించేడు. ఏవైనా ట్రక్కులొస్తే చెప్తానన్నాడు.

ఐదు కావస్తున్నా, ఏ ట్రక్కులూ రాలేదు. ఆర్.టి.ఓ. నా పీడ వదిలించుకుందా మనుకున్నాడు. నన్నూ నా సామాన్లనీ ఒక ఒంటరి రైలింజనులో ఎక్కించి, నాలుగు మైళ్ళ దూరంలో వున్న సింగార్ బిల్లు స్టేషనుకి తోలేడు. అక్కడ ఒక గూడ్సు సైడింగు వుందని, అక్కడికి చాలా మిలిట్రీ ట్రక్కులు సామాన్లకోసం వస్తాయని, యేదో ఒక దాంట్లో యెక్కి మీ యూనిట్ కి వెళ్ళిపోవచ్చని చెప్పేడు!

సింగార్ బిల్లు పేరుకే స్టేషను. అక్కడ ఏమీలేదు. ఒక చిన్న సిమ్మెంటు షెడ్డుంది. ఇంజను డ్రైవరు నన్నక్కడ దింపి, యింజన్ను తిరిగి అఖౌరా తీసుకుపోయేడు.

సింగార్ బిల్లు చిట్టడివిలో వుంది. నేను సామాన్లతో షెడ్డులో ఒంటరిగా నిలబడ్డా. గాలికి వెర్రిగా వూగుతున్న చెట్ల ఆకులు వలవల్లాడుతున్నాయి. వాన నీళ్ళు జోరుగా గలగల పారుతున్నాయి. గాలి ఝూంకారం చేస్తుంది. మళ్ళీ దట్టంగా మేఘాలు కమ్ముకొస్తున్నాయి.

అలా ఒక బక్కచిక్కిన మనిషొస్తూ ఔపించేడు. నేనతన్ని పిల్చి ఆ చుట్టుపక్కల యేమైనా మిలిట్రీ క్యాంపులున్నాయా అని ప్రశ్నించేను. అతనేదో చెప్పేడు. నాకర్థం కాలేదు. సామాన్లు యెత్తుకుని నా వెంట రమ్మన్నా. అతను ముందు రానన్నాడు. మూడు వేళ్ళు చూపించి రూపాయలిస్తానన్నా. ఎలాగో సామానెత్తుకున్నాడు. నేను ముందూ అతను వెనకా గమ్యం తెలియని ప్రయాణం. సుమారు గంట సేపు చితపతలాడే బురదలో నడిచేం. ఉండుండి అతను గొణగడం ప్రారంభించేడు. కనుచూపు మేరలో యెటు చూచినా ఇళ్ళ జాడలేదు. సింగార్ బిల్లు నుంచి సుమారు మూడు మైళ్ళు నడిచివుంటాం.

ఒక చోట ఒక కెప్టెన్ పదిమంది కూలీల చేత మన్ను తవ్విస్తున్నాడు. అతని దగ్గిరకెళ్ళి సెల్యూట్ చేసి "సిక్స్త్ ఇండియన్" గురించి భోగట్టా చేశా. అతనాలోచించి తల అడ్డంగా తిప్పి “సారీ” అన్నాడు. ఒకవేపు చూపించి అలా మైలు

వెడితే ఒక సిఖ్ఖుడిటాచ్మెంటు వుందని చెప్పేడు. నేను అనాలోచితంగా "ఇక్కడేదైనా ట్రక్కువుందా" అని అడిగా. అతను నడుంమీద చేతులేసుకొని చిరునవ్వుతో "నువ్వు యువకుడివి, సోల్జరువి, లెఫ్ట్ రైట్" అన్నాడు. నేను సెల్యూట్ చేసి తిరిగి ప్రయాణం ఆరంభించా. కూలివాడు మరి ముందుకి రానని సామాన్లు కింద పడేశాడు. నేను బతిమాలి ఐదు వేళ్ళు చూపించి రూపాయిలిస్తానన్నా. గునుస్తూ సామాన్లు తిరిగి యెత్తుకు బైల్దేరేడు.

నడవగా నడవగా, హఠాత్తుగా అడ్డంగా ఒక ప్రవాహం యెదురైంది. నీరు జోరుగా పారుతూంది. ఎంత లోతుందో తెలీదు. ప్రవాహం దాదాపు నూరడగుల వెడల్పుంది. దాని అవతల వెంపు చాలా మంది సిఖ్ఖు సిపాయిలు తవ్వకం పనిచేస్తున్నారు. వాళ్ళు నన్ను చూచి అరిచేరు, నవ్వేరు, వికారంగా నృత్యం చేసేరు. కూలివాడు ప్రవాహంలోకి దిగనని మళ్ళీ సామాన్లు కింద పడే సేడు. నేను వాడికేసి తీవ్రంగా చూసి. వస్తే డబ్బిస్తా, రాకపోతే తంతానన్నా. వాడు పిచ్చివాడిలా అరిచి సామానెత్తుకుని వచ్చేడు. ఆ ప్రవాహం దాటడం నిజంగా వొక సర్కసు పని అయింది.

అక్కడ చాలా గుడారాలున్నాయి. సిపాయిలు ఒక పెద్ద గుడారంలోకి నన్ను తీసుకెళ్ళారు. అందులో వొక సుబేదార్ మేజరు పక్క పరిచివున్న మంచం మీద కూచున్నాడు. నన్ను చూడగానే కుర్చీ మీద కూచోమన్నాడు. అతనికి ఇంగ్లీషు వచ్చు. కథంతా విని విచారించాడు. వెంటనే నాకు పొడి డ్రస్సు యిప్పించేడు. మంచి టీ, ఆవిర్లొస్తున్న చపాతీలు నా కోసం తెప్పించేడు. నేను తిరిగి మనిషినయేను.

ఆ రాత్రి అక్కడ పడుకోమన్నాడు. కాని నేను యూనిట్ చేరడానికి ఆత్రుతగా వున్నానని చెప్పేను. అతను నన్నర్థం చేసుకున్నాడు. కాని టెలిఫోన్లింకా బాగా పని చెయ్యడం లేదు. నాకొక ట్రక్కు యిచ్చి, నా యూనిట్ వెతుక్కోమన్నాడు. ఎనిమిది గంటల లోపున యూనిట్ దొరక్కపోతే తిరిగి వచ్చి రాత్రి అక్కడే గడపమన్నాడు. నేను డ్రైవరు పక్కని కూచున్నా. ట్రక్కు కదిలింది. బాగా చీకటి పడింది.

ఇప్పుడు దృశ్యం వేరు. విశాలమైన, తిన్నని, నున్నని తారు రోడ్లు. ఏ రోడ్డూ పదిమైళ్ళకి తక్కువ పొడుగు లేదు. అక్కడే టెలిఫోన్ హెవీ ఎక్సేంజీ, ఎయిరోడ్రోము మొదలయిన ముఖ్య మిలిటీ విభాగాలున్నాయి. అక్కడ పరిశుభ్రత తాండవిస్తూంది.

ఆ నున్నటి రోడ్లమీద మా ట్రక్కు చాలా దూరం ముందుకీ వెనక్కీ తిరిగింది. ఎంత భోగట్టా చేసినా "యాకాక్" యూనిట్టే దొరక లేదు. సిపాయి డ్రైవర్ నా యూనిట్నియెలాగైనా పట్టాలని పట్టుగా వున్నాడు. సెంట్రీ ఔపించిన దగ్గరల్లా ట్రక్కు ఆపి, దిగి వెళ్ళి, సెంట్రీని, గార్డు కమాండర్ని కనుక్కుంటున్నాడు. తిరిగొచ్చి "నహీసాబ్" అని నాతో చెప్పి, వాళ్ళని పంజాబీలో బూతులు తిట్టుకునేవాడు.

ఎనిమిదౌతూంది. నాకు నిరాశ కలుగుతూంది. ఇంతలో ఎదురుగా ఒక పెద్ద మిలిట్రీ కట్టడం ఔపించింది. అది చేరగానే ట్రక్కు ఆపమని నేనే దిగి అందులోకి వెళ్ళేను. అక్కడంతా తెల్లవాళ్ళే వున్నారు. అది హెవీ ఎక్స్చేంజి.

అక్కడ “F–N”లు (ఒక అశ్లీలమైన మాట) జోరుగా యెగురుతున్నాయి.

“బిల్! F–N సిక్స్తిండియన్ హెవీ యాకాక్ నీకు తెలుసా! దాన్ని లైనులోకి తీసుకు రాగలవా? దాని కోసం యిక్కడొక మనిషున్నాడు. తిండి లేక వానలో నాని కుళ్ళిపోయిన యలకలా వున్నాడు పాపం...”

ఆ ఉదయం నుంచి టెలిఫోను లైన్లు బాగు చేయడానికి అవకాశం చిక్కింది, క్రమేణా యూనిట్లు లైనులో కొస్తున్నాయి.

“జానీ ఇలా రా. ఇదుగో సిక్స్తిండియన్. మాట్లాడు” బిల్.

అది మా వర్కుషాపు కాదు తీగకవతల కొసని మాట్లాడుతున్నది సార్జంటు స్మిత్.

“ఏబుల్ బ్యాటరీ”

“నేను హవల్దార్ రావ్ ని మాట్లాడుతున్నా...”

“హవల్దార్ ఎవరు?''

“రావ్...”

“వెల్....?"

“నేను సిక్స్తిండియన్ హెవీ యాకాక్ వర్కుషాపుకి పోస్టింగు అయివచ్చాను. హెవీ ఎక్స్చేంజి నించి మాట్లాడుతున్నా...”

“ఆ యూనిట్టింకా పుట్టలేదు జానీ...”

“పుట్టలేదు? కాని నాయూనిట్టదే. నాదగ్గిర ఆర్డర్సున్నాయి." టెలిఫోన్లోంచి ఈలలు పాటలు నవ్వులు వినిపిస్తున్నాయి.

“ఉంది. కాని యిది ఒక సిక్కు డిటాచ్ మెంటుది. డ్రైవరుకి సిక్స్తిండియన్ తెలీదు...”

“తస్సదియ్య....పోనీ నువ్వక్కడే వుండు, పావుగంటలో ట్రాన్సుపోర్టు పంపుతున్నా. ఓకే...”

“ఓకే! థాంక్యూ...”

నేను హెవీ ఎక్స్చేంజీ వాళ్ళకి చాలా థాంక్సు చెప్పి బైటకొచ్చా. సంగతి డ్రైవరుతో చెప్పా.

“అయితే ఆ ట్రక్కు వచ్చేవరకూ నేను ఆగి వెళ్ళనా సాబ్?''

“దయచేసి అలా చెయ్యి...''

“ఠీక్ హై సాబ్"

ట్రక్కొచ్చింది. డ్రైవరొక లాన్స్ కార్పొరల్ హోదా వాడు. సిక్ఖు డ్రైవరు నా సామాను రెండో ట్రక్కులో వేసేడు. మేజర్ సాబ్ కి నాసలాం చెప్పమన్నా. అతను తన ట్రక్కు తిప్పుకు వెళ్ళిపోయేడు.

"కమాన్ జానీ.." లాన్స్ కార్పొరల్

నేను డ్రైవరు పక్క సీటులోకి దూకా. ట్రక్కు పరుగు లంకించుకుంది. నున్నటి తడి రోడ్ల మీద తేజోవంతమైన తన దీపాల కాంతిని ముట్టుకుంటూ గాలిలా పోతూంది. లాన్స్ కార్పొరల్ అదే పనిగా ఏదో మాట్లాడుతున్నాడు. ట్రక్కు చప్పుడొకటి, దానికి తోడు లాన్స్ కార్పొరల్ బాగా డోసు మీదున్నాడు. నేను యస్, నో – లతో కాలక్షేపం చేస్తున్నా.

చర్రున బండి కుడి ప్రక్కకి కోసేడు. మెటల్ రోడ్డు విడిచి బండి అడవి త్రోవ పట్టింది. రెండు ప్రక్కలా ఎత్తైన చెట్ల మధ్య యిరుకైన బురద తోవ. బురదనీ తోవలో బడ్డ చెట్ల కొమ్మల్ని మట్టుకుపోతూంది ట్రక్కు. వెళ్ళి వెళ్ళి ముందువేపు కుడి చక్రం బురద గుంటలో కూరుకుపోయింది. బండి కదల్టు.

డ్రైవరు "F–N" ల వర్షం కురిపిస్తూ చివాల్న బండి దిగి చక్రం పరిశీలించాడు. బురద గుంటలో సగం పైగా దిగబడిపోయింది. చక్రం కదుల్తూందిగాని బండి ముందుకి పోదు, వెనక్కి రాదు. డ్రైవరు యిటూ అటూ వున్న మొక్కలు పీకి, చక్రం కింద దోపి వచ్చి కూర్చుని బండి స్టార్టు చేశాడు. గుర్రు గుర్రు మంటుంది కాని బండి కదల్దు. మళ్ళీ "F–N" ల వర్షం కురిపించి, కిందికి దిగి, మరోకొంత రొట్ట పీకి, చక్రం కింద పెట్టి సీట్లో కొచ్చి స్టార్టు చేశాడు. మళ్ళీ అంతే. ఇలా చాలా సార్లు చేశాడు, లాభం లేకపోయింది. వచ్చి సీట్లో కూచుని నావేపు చూసి నవ్వి, సిగరెట్లు తీసి నాకోటిచ్చి తనోటి ముట్టించేడు.

"ఏం చేదాం" అన్నాను.

"సిగరెట్టు కాల్చు..." మళ్ళీ నవ్వి హాయిగా ఈలపాట పాడేడు.

అలా భజనచేస్తూ పావుగంట యిద్దరం కూచున్నాం. అదంతా వట్టి అడవి. సరైన మార్గంకాదు. అక్కడికి యాభై గజాల దూరంలోనే అడ్డంగా ఒక రోడ్డుంది. అదికూడా కచ్చా రోడ్డే. కాని కాస్త విశాలంగా వుంది.

అప్పుడే అదృష్టవశాత్తు ఆ రోడ్డుమీంచి "ఒక బ్రేక్ డౌన్ వ్యాన్" వెళ్ళిపోతూంది. మా లాన్స్ కార్పొరల్ దాన్ని ఆపేడు. "ఏయ్ జోవ్! నా ట్రక్కు ఇక్కడే బురదలో కూరుకుపోయింది. దయచేసి ఆ జంతువుని బైటకి లాగిపారేస్తావా?"

బ్రేక్ డౌన్ వ్యాన్ డ్రైవరు తన సీటులోంచి కాస్త వంగి చూసి "ఓకే" అన్నాడు. మా లాన్స్ కార్పొరల్ ఓకే, ఓకే అని దారి చూపిస్తూంటే బ్రేక్ డౌన్ వ్యాన్ రివర్సులో మా ట్రక్కు ముందుకొచ్చింది. వాళ్ళిద్దరూ "టౌ రోపు" దానికి తగిలించి సుళువుగా బైటకి లాగేశారు. బ్రేక్ డౌన్ వెళ్ళిపోయింది. మేము బైల్దేరేం.

మరో పావుగంటలో ఏబుల్ బ్యాటరీ చేరాం. నేను వెంటనే ఆర్డర్లీ ఆఫీసర్ని కలిసేను. నా పేరు వగైరా అతనికి చెప్పేను. నేను పడ్డ అవస్తంతా చెప్పేను. అతను వెంటనే రెజిమెంటల్ హెడ్ క్వార్టర్సులో ఎడ్జటంటుతో ఫోన్లో మాట్లాడేడు.

“చూడు, హవల్దార్ రావు! మీ వర్కుషాపు యూనిటింకా ఆరంభం కాలేదు. నువ్వే ఆదికి ముందొచ్చేవు. నువ్వే వెదుళ్ళు నరికి చీల్చి నిర్మాణం ఆరంభించాలి. కొద్ది రోజుల్లో నీ కెప్టెన్ ఆఫీసరు కమాండింగు వస్తాడు క్రమేణా అంతా వస్తారు...!” ఆర్డర్లీ ఆఫీసర్.

“అంతవరకూ నేనెక్కడుండేది?”

"ఆర్.హెచ్.క్యూలో. ఈ రాత్రి ఇక్కడ పడుకో. పొద్దున్న ట్రక్కులో అక్కడికి వెళుదువుగాని. భోంచేశావా?”

“లేదు...”

“కన్నియప్పన్!”

“సాబ్...”

“ఇతనికి ఖాళీ గావున్న 'చాషా' (వెదురు గది) చూపించు, భోజనం పెట్టించు.”

“వాంగో సార్...”

కన్నియప్పన్ సిపాయి గన్నరు నా గదికి దారి చూపించేడు. పక్కపరిచేడు. నేను కాళ్ళు చేతులు కడుక్కున్న తరువాత భోజనం తెచ్చేడు.

భోంచేసి పడుకున్నా.

మర్నాడుదయం ఏడుగంటలకి ఆర్.హెచ్.క్యూ చేరాను. అక్కడ సిఖ్ఖు మేలాసింగ్, మలయాళీ “ప్రభు” నా సహ వుద్యోగస్తులున్నారు. నా కంటె బాగా సీనియర్లు, మంచివాళ్ళు.

పది రోజులు పోయాక మా ఓసీ కెప్టెన్ విన్స్టన్ వచ్చేడు. క్రమంగా కొంతమంది విదేశీ, స్వదేశీ సిబ్బంది వచ్చేరు.

మా రెజిమెంటు బళ్ళు, గన్నులు మరమత్తు చెయ్యడం, వాటినన్నిటినీ ఎప్పటికప్పుడు "తయార్” గా వుంచడం మా వర్కుషాపు విధి.

విమాన విధ్వంసక శతఘ్నులకి “రాడార్” ఆయువుపట్టు. అప్పుడు దాని చరిత్ర అతి రహస్యమైంది. ప్రిడిక్టర్లు పాడైతే వాటిని అతిత్వరగా బాగు చెయ్యాలి. ఆ పని తెల్లవాళ్ళే చేసేవారు. భారతీయుల్ని ఆ జోలికి రానిచ్చేవారు కారు. ఆఫీసులో దానికి సంబంధించిన ఫైలు అతి రహస్యమైంది. అప్పట్లో దాన్ని "G.L." అనేవారు. అంటే గన్ లేయింగ్. ఈ జి.యల్. పరికరమే తరువాత రాడార్ గా మారింది. యుద్ధం వత్తిడి యెక్కువై, మనుషులు చాలని పరిస్థితిలో క్రమేణా భారతీయ ఇన్ స్ట్రుమెంటు మెకానిక్కులకి కూడా ఈ అతి రహస్యమైన సాంకేతిక విద్య నేర్పక తప్పలేదు. మనవాళ్ళు శతఘ్ని యెక్కడ పాడైందో కనిపెట్టడం, ప్రిడిక్టరు పానెల్సు యెలా విప్పాలో, అవియెలా మరమత్తు చెయ్యాలో అన్న విషయాల్లో గొప్ప ప్రావీణ్యం సంపాదించారు. అందుకే కామోసు మొన్న పాకిస్తాన్ యుద్ధంలో సాబర్ జెట్ విమానాల్ని పిట్టల్ని కొట్టినట్టు కాల్చిపారేశారు. అప్పటి అనుభవం ఈ తరంలో పనికొచ్చింది.

4

"ఓ బిదేశ బంధోరే! అమీ తొరే చాయ్ నా జొఖాన్ తోరె మొనేపొడీ,

తొఖొన్ తొరె పాయ్ నా..." (దూరదేశంలో వున్న ఓ ప్రియుడా, నువ్వు నాకక్కర్లేదు. కారణం, నేను కావాలన్నప్పుడు నువ్వు లభించవు.)

నిశ్శబ్దాన్నీ, చీకటిని చీల్చుకుని, తారాజువ్వలా, మిలామిలా మెరిసే చుక్కల్లోకి దూసుకుపోయింది కంఠం.

పదకొండేళ్ళ కుర్రాడు. పలచగా, నల్లగా వున్నాడు. మూరెడుచింకి కుళ్ళుగుడ్డ మొలకి చుట్టుకున్నాడు. ఎడంచేతిలో పొడుగాటి సన్నటి కర్ర, కుడిచేతిలో నేనిచ్చిన సిగరెట్టూ ఉన్నాయి. కంచుగీసినట్టున్న కంఠంతో, కంఠంలో వొణుకుతో, జంకూ కొంకూ లేకుండా నిబ్బరంగా విసిరేదు పాట. నా ఒళ్ళు ఝల్లుమంది.

ఆర్.హెచ్.క్యూ. చిట్టడివిలో వుంది. అక్కడ వెదురు పొదలెక్కువ. పులులు, ఎలుగుబంట్లూ ఉన్నాయి. మా క్యాంపు నించి రెండు ఫర్లాంగు లెటువేపైనా వెడితేచాలు, యిక అడుగు పెడితే ముందేముందో అనిపించే అడివి అందం చూడొచ్చు. గార్డు రూముకి పక్కనే నా గది వుంది. తరచు రాత్రుళ్ళు గార్డు కమాండరు "అడి అడి" ('కొట్టు కొట్టు' తమిళం) అన్న కేక, వెంటనే రైఫిలు పేల్చిన శబ్దం వినిపించేవి. నేనులేచి బైటకొచ్చి కనుక్కుంటే 'పులి సార్ పులి" అనే వాడు గార్డు కమాండరు.

ప్రతిరోజూ సాయంత్రం ఆఫీసునించి వచ్చేకా, చెర్లో స్నానం చేసి, ఫలహారం తిని, నేనూ మేలాసింగ్, ప్రభూ షికారు వెళ్ళే వాళ్ళం. ఎక్కువదూరం వెళితే ప్రమాదం.

ఆ చుట్టుపట్ల చిన్న చిన్న గ్రామాలున్నాయి. అక్కడి ప్రజలు యెక్కువమంది ముస్లిములు. వాళ్ళెప్పుడూ ఉర్దూ, హిందీ వినలేదు. వాళ్లు మాట్లాడేది బెంగాలీ. కాని అది తూర్పు బెంగాలు భాష . నాకు కొంచెం కూడా అర్థం కాదు.

నా మీద ఆ గ్రామీణులందరికీ చాలా అభిమానం. నేను వాళ్ళతో చెట్టాపట్టాలేసి తిరిగే వాణ్ణి. వాళ్ళకది చాలా గొప్పగా వుండేది. వాళ్ళకి నా మాటలు బోధపడవు. నాకు వాళ్ళ మాటలర్థం కావు. అయినా నవ్వుతూ మాట్లాడుకునేవాళ్ళం.

మా యూనిటు నానుకునే వున్నవూరు షిరాజ్ పూరు. అక్కడ సుమారు ఇరవై యిళ్ళున్నాయి. ఒకటి రెండు తప్పితే అన్నీ పూరి కొంపలే. చెరువుంది. అందులోనే మేం ప్రతి ఉదయం, సాయంత్రం స్నానం చేసేవాళ్ళం.

ఆ ఊరి పెద్ద అబ్దుల్. అతనికి నలభైయేళ్ళుంటాయి. నలుగురు భార్యలున్నారు. వాళ్ళకి యేమంత ఘోషా లేదు. చుట్టుపట్ల మిలిట్రీ వాళ్ళుండడం చేత వయసులో వున్న స్త్రీలు వొంటరిగా బైట మెసిలేవారు కారు.

అబ్దుల్ నన్ను భుజంమీద చెయ్యేసి యింట్లోకి తీసుకెళ్ళేవాడు, టీ యిచ్చేవాడు. నిజానికా టీగుండా, పాలడబ్బా నేనిచ్చినవే.

తినడానికి తిండి లేకపోయినా, బతుకొకయాతనైనా, ఆ గ్రామీణులు లేని సంతోషం తెచ్చుకుని జీవితం లాగిస్తున్నారు. పచ్చని గుట్టలు, లెక్కలేనన్ని చెరువులు, చెట్లు చామల మధ్య ప్రశాంతంగా, అతి సామాన్యంగా బ్రతుకు వెళ్ళబుచ్చే వీళ్ళు, తమ ఉనికి మీదికి వేనకివేలు మిలిట్రీ వాళ్ళు. నానా దేశాల వాళ్ళు, లారీలతో, టాంకులతో ఇతర భారీయంత్ర సామగ్రితో వచ్చి చెలరేగుతూంటే, నిస్సహాయంగా, దిస్సపోయిచూస్తున్నారు. పిల్లల ముందుగతి గురించి, స్త్రీల మానధనం గురించి బెంగపడి కుంగిపోతున్నారు.

ఆ సాయంత్రం నేనూ నా స్నేహితులిద్దరూ ఎనిమిదో క్యాంపు వేపు షికారు వెళ్ళేం. అదొక మైలు దూరం వుంటుంది. ఆ క్యాంపు అమెరికన్లది. వాళ్ళు ఆ స్థలాన్ని వారం క్రితమే విడిచి వెళ్ళేరు. అక్కడ సుమారు యాభై బాషాలున్నాయి. అన్నీ ఖాళీగా “దిం”మంటున్నాయి. క్యాంపుకి వొకపక్క విశాలమైన సమతల మైదానం వుంది. మైదానం అవతల వొక మైలు దూరంలో యేదోపల్లె వున్నట్టు మినుకు మినుకుమనే దీపాల వల్ల తెలుస్తూంది. క్యాంపుకి రెండో వెంపు, వెనకతట్టు యెత్తు పల్లాలు, చెట్లూ చామలూ చిట్టడవి. క్యాంపులోపలా బైటా తిరుగుతూ కొంత సేపు కబుర్లాడుకున్నాం.

మేలాసింగు నాలాగే యువకుడు. అతనికి పెళ్ళయింది. అతనికెప్పుడూ భార్య కర్తార్ కౌర్ మీదే ధ్యాస. ఆమెని తలవని నిముషం లేదు. తల్లిదండ్రులంటే మహా కోపం. వాళ్ళు చచ్చిననాడు "ఖీర్” వండింది తింటాననేవాడు. 'తను దగ్గరున్నప్పుడే కర్తార్ ని తెగ సాధిస్తారు, తన పరోక్షంలో వాళ్ళామెని యేం హింస పెడుతున్నారో' అని బెంగ.

ప్రభూ నడివయసు వాడు. అతని పూర్తి పేరు ప్రభాకరన్ నాయర్. అతని పళ్ళు మొలక వజ్రాల్లా మెరుస్తూంటాయి. భార్య పంపిన నల్ల పళ్ళపొడితోనే యెప్పుడూ పళ్ళు తోముకునేవాడు. పళ్ళమీద మచ్చలు పడిపోతాయని కాఫీ, టీ తాగేవాడుకాదు. అతని భార్య బి.ఏ.బి.టి. వైకోమ్ లో టీచరు. ముగ్గురు పిల్లలు. ప్రభూ, భార్య వుత్తరాలు జోరుగా రాసుకునే వారు. నేను ఆవిడ రాసిన వుత్తరాలు చూసి ముచ్చటపడేవాణ్ని. నాకు మలయాళం చదవడం రాదు. కాని ఆ చేవ్రాలు ముత్యఫలాల్లా వుండేది. ఆ చక్కని చేవ్రాలు బట్టి ఆమెకూడా అందంగా వుండాలని వూహించేవాణ్ని.

మా కబుర్లు సాధారణంగా స్వగ్రామాల గురించి, మనుషుల భాషలు, అలవాట్లు ఆచారాల గురించి సాగేవి.

ఇంతలో సంజ చీకటి పడింది. మావేపు నల్లగా, పొట్టిగా ఓ ఆకారం వస్తూంది. ఇంత చీకటి పడ్డాక యిక్కడ యింత చిన్న కుర్రాడెవరు చెప్మా అని మేం ఆశ్చర్యపోతున్నాం, మా ముగ్గుర్లో సిగరెట్టు కాల్చేది నేనొక్కడ్నే. ఆ కుర్రాడు నా ముందు టక్కని ఆగి, సలాం చేసేడు! వాడికి పది పదకొండేళ్ళుంటాయి.

“సలాం సాయబ్...”

“ఎవడ్రా నువ్వు, యింత చీకట్లో....” నేను తెలుగులోనే అన్నా.

చీకటిలో వాడి కళ్ళు చిరునవ్వు మెరిసేయి.

"సిగరేట్ దావ్ సాయబ్..." సిగరెట్టడిగేడు. ప్రభుకి వాడి మాటలు వినగానే చెప్పలేని సంతోషం కలిగింది. "డేయ్? ఉన్ పేరెన్న? వయసెత్తర?" తమిళంలో ప్రశ్నించేడు. వాడు మళ్ళీ దీనంగా "సిర్ గిరేట్ సాయబ్" అన్నాడు. మేలాసింగు ముందుకొచ్చి వాడి చెయ్యి పట్టుకున్నాడు. "దేఖో! తూయేక్ గానా గావ్, తబ్ తుమ్హే యేక్ బిడియా సిగరెట్ మిలేగా. సమ్ఝే" మేలా.

వాడు మేలాసింగ్ వేపు జాలిగా చూసేడు.

"పాట్ట, పాట్ట. మస్సలయిల్లా గానా గాన్ ఆ....ఆ'''ప్రభూ.

"గాన్ జానీనా సాయబ్ (పాటరాదు)" నావేపు చూసి అన్నాడు.

"గానా నహీ-సిగరెట్ నహీ-గానా హై-సిగరెట్ హై'''మేలా.

"అచ్చా సాయబ్-దావ్"

నేనొక సిగరెట్టిచ్చి అగ్గిపుల్ల గీసివెలిగించేను, వాడు రెండు దమ్ములాగేడు. హుషారెక్కి పాట అందుకున్నాడు. "ఓ బిదేశ బంధోరే... అమీ తొరే చాయ్ నా...జోఖోన్ తొరెమొనే పొడి... తొఖాన్ తొరె షాయేనా..."

నిశ్శబ్దమైన సంజలో ప్రతిధ్వనిస్తూ, అతి సున్నితమైన విప్రలంభ శృంగార భావంగల ఆ పాట ఆకాశాన్ని దూసుకుపోయింది.

వాడు పాటముగించి, సలామ్ సాయబ్ అని "గోరూ గోరూ" (పశువులు పశువులు) అంటూ మైదానం వెంపు పరిగెత్తేడు. వాడు కాస్తూన్న పశువులు మైదానం మీంచి దూరపు దీపాల ఆనవాలున పల్లె వెంపు వెళిపోతున్నాయి. వాడా చీకట్లో "గోరూ హెయ్, గోరూ హెయ్" అని పశువుల్ని అదలిస్తూ, సిగరెట్టు వూపుకుంటూ పరిగెత్తుతున్నాడు.

మేం ఇంకా నవ్వుకుంటూనే వున్నాం. వాడు వంద గజాలైనా వెళ్ళి వుండడు, ఒక భయంకరమైన అరుపు అరిచేడు. మేం తుళ్ళిపడి అటు చూసేం. వాణ్ణేదో అడివి జంతువు పట్టుకొని, పక్కనున్న గోర్జిలోకి వల వల యీడ్చుకుపోతూంది, చిరతపులై వుంటుంది. మేం నేరస్తుల్లా వొకరి మొహాలొకరు చూసుకున్నాం.

వాడు రాత్రి యింటికిరాక వాడి తల్లి యెంత బెంగటిల్లి పోతుందో. ఇందులో మా దోషం ఏమైనా వుందా? మేం సిగరెట్టు ఆశచూపి వాడిచేత బలవంతాన పాడించేం, వాడి గొంతు వినే చిరత గొడ్డు వచ్చిందా? ఏమో?

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments